

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

గురువారం,8 మే 2025

8 పేజీలు


### ఆపరేషన్ సింధూర్‌తో

# ఉగ్రవాద అంతానికి అడుగులు

**సైన్యానికి,కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు : మంత్రి పార్ధసారధి**



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** భారతదేశంతోపెట్టుకుంటే ఎలా ఉంటుందో ఇప్పుడు పాకిస్తాన్‌కు అర్ధమయిందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ఇండియన్ ఆర్మీ తగిన బుద్ధి చెప్పిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాద అంతానికి శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడనున్నాయన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.

### ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో

# పెకిలించడమే భారత్ లక్ష్యం

– ఆపరేషన్ సిందూర్‌'ను స్వాగతించిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రపంచ శాంతికి విఘాతంగా మారిన ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించడమే భారత్ లక్ష్యం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్, పిఓకే ప్రాంతంలోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రతీకార దాడిని ఎంపీ మహేష్ కుమార్‌స్వాగతించారు. స్థానిక శాంతినగర్ లోని క్యాంపుకార్యాలయంలో బుధవారం ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత సైన్యం ప్రతీకార దాడి నిర్వహించిన కొన్ని గంటల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమై

- తరువాయి 2లో..

### ఆపరేషన్ సింధూర్

# సాహసోపేత చర్య

**- ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో చారిత్రాత్మక ఘట్టం**

**- కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" సాహసోపేత చర్యగా నిలిచిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. బుధవారం సాయంత్రం నరసాపురం పార్లమెంట్ బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పహల్గామ్‌లో పర్యాటకుల మీద దాడి చేసి 26 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులకు సంబంధించి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనీ శిబిరాలపైన ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, నావికా దళం, వైమానిక దళం సమన్వయంతో ఖచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ (జెఎం ) ప్రధాన కార్యాలయాన్ని , వారి శిబిరాలను ధ్వంసం చేశాయన్నారు. ఈ దాడులు భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయి. ఈ దాడి ఆక్రమిత కాశ్మీర్‌లోనీ ఉగ్రవాద శిబిరాలపై దాడి గానే చూడాలి గాని పాకిస్థాన్‌పై దాడిగా చూడటం తగదని వర్మ తెలిపారు. భారత ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేశ రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ఆర్టికల్ 370, 35ఎ రద్దు , జమ్ము కాశ్మీర్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల



నిర్వహణ వంటి ఎన్నో నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని శ్రీనివాస వర్మ అన్నారు.

కేంద్రప్రభుత్వం చర్యల వల్ల కాశ్మీర్‌కు పర్యాటకుల తాకిడిబాగా పెరిగి స్థానికులకు పర్యాటక రంగంపై ఆదాయం వస్తున్న తరుణంలో ఉద్దేశ పూర్వకంగానే ఉగ్రవాదు లు కాశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడ్డారు అన్నారు. పర్యాటకులలో అభద్రతాభావం కల్పించాలనే కారణంగానే దాడి చేసి దారుణానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

ఏ సమస్య అయినా సామరస్యంగా సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అయితే ఏచర్య తీసుకున్న ప్రజలు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు.

### ఎటువంటి పరిస్థితినైనా

# ఎదుర్కొనేందుకు అప్రమత్తం

**- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి వెల్లడి**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లాలో ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేలా ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్రముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకు తెలిపారు. దేశంలో ప్రస్తుత యుద్ధ వాతావరణం నెలకొన్న సందర్భంలో రాష్ట్రంలోని ప్రజలకు విపత్తు పరిస్థితులలో ప్రాణ రక్షణకు తీసుకోవలసిన చర్యలపై మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహణపై జిల్లాలకలెక్టర్లు,త్రివిధ దళాలకు చెందిన రాష్ట్ర ఇంచార్జిలు, విపత్తు నివారణ దళాలు, రైల్వే అధికారులు, తదితరులతో రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారాసమీక్షించారు. ఈ సందర్భంగా ముఖమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ యుద్ధ పరిస్థితిని భారత్ ధీటుగా ఎదుర్కొంటుందని, అయినప్పటికీ ప్రాణ రక్షణకు ప్రజలను పూర్తి స్థాయిలో అప్రమత్తం చేసేలా మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. దేశంలోని ప్రస్తుత విపత్కర పరిస్థితుల

- తరువాయి 2లో..

# ప.గో.జిల్లా అభివృద్ధికి పలు మేలైన చర్యలు

**- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి 'గొట్టిపాటి '**





**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా మేలైన చర్యలను చేపట్టినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం భీమవరం కలెక్టరేట్ విశిష్ట సమావేశ మందిరం నందు రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన జిల్లా సమీక్ష మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు,జిల్లా కలెక్టర్‌చదలవాడనాగరాణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. తొలుత సమీక్ష ప్రారంభానికి ముందు కేంద్ర, రాష్ట్రమంత్రులు,జిల్లా కలెక్టర్ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గత ఆరు నెలలుగా జిల్లాలో చేపట్టినఅభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో పాటు, నూతనంగా

- తరువాయి 2లో..

# గంజాయి, పేకాట,క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కు పాదం





**– యుద్ధం నేపథ్యంలో డ్రోన్లతో గస్తీ కార్యక్రమాలు : ఐజీ**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్ ఏలూరు 3టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా రేంజ్ ఐజీకి ఏలూరు 3 టౌన్ పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.కీలక కేసులు గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా బాధితులకు న్యాయం,నిందితులకు శిక్ష పడేవిధంగా చూడాలి అని,పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, పేకాట, క్రికెట్ బెట్టింగ్ లపై ఉక్కు పాదం మోపాలని కీలక కేసులను గుర్తించి వాటిని సాక్షాదారాల తో నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేయాలని అశోక్ కుమార్ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్స్ లను పరిశీలించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ లో సీజ్ చేయబడిన వాహనాలు మొదలైన వాటి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న వారెంట్ లను అమలు చేయాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలోఉన్నరౌడీ షీటర్‌లపై ప్రత్యేక దృష్టి సారించి ,వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలిని తెలియజేసారు. బీట్స్ బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే రెగ్యులర్ క్రైమ్ పై ప్రత్యేక దృష్టి సారించి దొంగ తనములను పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు తీసుకోవాలని, తెలియజేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం లో ఐజి మొక్క నాటారు.ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఐజి,హెల్మెట్ లను అంద చేశారు.ఈ కార్యక్రమంలో ఐజితో పాటు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ,డిఎస్పి డి శ్రావణ్ కుమార్ 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

– గణనీయంగా తగ్గిన నేరాలు –ఈ సందర్భంగా ఐజి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఏలూరు రేంజ్‌లో నేరాల శాతం గణనీయంగా తగ్గిందని తెలిపారు. అయితే సైబర్ క్రైమ్ నేరాలు మాత్రం పెరుగుతున్న నేపథ్యంలో దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఇందుకోసం సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు.సీబీఐ, ఎన్ఫోర్స్మెంట్ వంటి పేర్లతో మోసాలు జరుపుతున్న ఘటనలపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, ఇంకా జాగ్రత్త వహించాలని సూచించారు.భద్రతా పరంగా, ఏలూరు నగరంలో ఇప్పటి వరకు 5వేలు సీసీ కెమెరాలు, జంగారెడ్డి గూడెంలో 300 పైగా సీసీ కెమెరాలు,ఏలూరు రేంజ్‌లో 22వేలు పైగా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక మానవ వనరులతో ఒక ప్రత్యేక టీం ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.యుద్ధం వంటి అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంతాల్లో కోస్ట్ గార్డులను అప్రమత్తం చేయడం జరిగిందని, అలాగే డ్రోన్లను ఉపయోగించి గస్తీ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్ట విరుద్ధమైన, అభ్యంతరకరమైన పోస్టులు పెడితే, సంబంధిత వ్యక్తులపై గ్రూప్ అడ్మిన్ల పై కూడా చట్టప రమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఎస్‌జిటి టీచర్ పోస్టులకు అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు ఉచిత శిక్షణ

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థుల కోసం ఉచిత మెగా డిఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి బి.రామ్ కుమార్ తెలిపారు. దృష్టి లోపం, వినికిడి లోపం, శారీరక వైకల్యం కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎస్ జిటి టీచర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల కోసం ఈ శిక్షణ ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ కోర్సుకు దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా అనగా %ఎంటఎ.ఖజూఎటంం.అఅ% వెబ్ సైట్ ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చుని, కనీసం 40శాతం వైకల్యం కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. శిక్షణ కొరకు ఎంపిక టెట్ స్కోర్ ఆధారంగా జరగనుందన్నారు. ఎంపిక అయిన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతులలో శిక్షణ, స్టడీ మెటీరియల్స్, ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించబడతాయన్నారు. ఈ విలువైన అవకాశాన్ని జిల్లాలోని అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన మెగా డిఎస్సీ అభ్యర్థులు సద్వినియోగ పరచుకొని వారి భవిష్యత్తును మెరుగుపరచు కోవలసిందిగా ఆయన కోరారు.

# ప.గో.జిల్లా అభివృద్ధికి పలు మేలైన చర్యలు

మొదటిపేజి తరువాయి

చేపట్టిన ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తొలుత వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ రబీ సీజన్‌లో దిగుబడి ఎంత వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు, ఇంకా ఎంత రావచ్చు అనే విషయాలను ప్రస్తావించారు.రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వ్యవసాయ సాగులో డ్రోన్ టెక్నాలజీని బాగా ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై తార్పాలిన్లను అందించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. జల వనరుల శాఖపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షిస్తూ నియోజకవర్గాలలో క్షేత్రస్థాయిలో అవసరమైన పనులను గుర్తించి చేపట్టేందుకు స్థానిక శాసనసభ్యులతో మాట్లాడి పనులను చేపట్టాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువలు, డ్రైన్లు పూడిక పనులు చేపట్టవలసిన అవసరం ఉందని సభలో వివరించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కాలువలు, డ్రెయిన్లు పూడుకుపోవడం వలన నరసాపురం ప్రాంతంలో సాగు విస్తీర్ణం తగ్గిపోతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఉండిలో నిర్మించిన ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్ వినియోగంలోనికి రాలేదని, విలువైన యంత్ర సామాగ్రి నిరుపయోగంగా ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ వివరణ ఇస్తూ దీనిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి విద్యాశాఖ గురించి సమీక్షిస్తున్న సమయంలో మనబడి– మన భవిష్యత్తు పనులు ఏ విధంగా సాగుతున్నాయని ఆరా తీశారు. పాఠశాలల విలీనం కారణంగా స్కూల్స్ మూసివేయడం లక్ష్యం కాదని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖను సమీక్షిస్తున్న సందర్భంలో తణుకు శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ దివ్యాంగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌తో దివ్యాంగుల ఇబ్బంది పడుతున్నారని, వైజాగ్, రాజమండ్రి వెళ్లాల్సి వస్తుందని ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఇన్చార్జి మంత్రి హామీ ఇచ్చారు.

– అన్ని శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష –

డిడిఆర్‌సి సమావేశంలో చర్చించిన అంశాలపై విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అన్ని శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించడం జరిగిందని, శాసనసభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన అంశాలపై తగు ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ఆసుపత్రులలో మంచి పరికరాలు ఉన్న వినియోగించడానికి టెక్నీషియన్ల కొడత ఉందని తాడేపల్లిగూడెం, తణుకు ఎమ్మెల్యేలు సభ దృష్టికి తీసుకురావడం జరిగిందని, దీనిపై.ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. భీమవరం పరిధిలో మూడు బ్రిడ్జిలు నిర్మాణాలు అప్రోచ్ రోడ్లు లేక పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం భీమవరం శాసనసభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రవి ధాన్యం కొనుగోలను రైతులకు ఇబ్బంది లేకుండా ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్.సి.పి.సి చైర్ పర్సన్ పీతల సుజాత,జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి,జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు,ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించడమే భారత్ లక్ష్యం

మొదటిపేజి తరువాయి

తదుపరి చర్యలపై చర్చించిందని ఎంపీ తెలిపారు. సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌ను కేంద్ర మంత్రివర్గంతో పాటు యావత్ భారత్ జాతి ప్రశంసించిం దని ఎంపీ పేర్కొన్నారు. కేబినెట్ భేటీకి ముందు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్,జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ సరిహద్దుల్లో పరిస్థితి గురించి ప్రధానికి వివరించారని ఎంపీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలపై సైన్యం మెరుపు దాడులు నిర్వహించడం ద్వారా ఉగ్రవాదులకు భారత్ గట్టి హెచ్చరిక జారీ చేసిందని ఎంపీ అభిప్రాయ వ్యక్తం చేశారు. అత్యంత కచ్చితత్వంతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని 9 ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపిందని, పాకిస్తాన్ తిరిగి దాడికి దిగితే తిప్పి కొట్టేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఎంపీ తెలిపారు. ఉగ్రవాదాన్ని కట్టడి చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించారని ఎంపీ పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, భారత సైన్యం అండగా ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు.

## ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అప్రమత్తం

మొదటిపేజి తరువాయి

నేపథ్యంలో కేంద్రహోమ్‌శాఖ ఆదేశాలననుసరించి ప్రజల రక్షణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఎటువంటి ఆందోళనలను గురికాకుండా జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు ప్రజలను అప్రమత్తంచేసి, ఎటువంటి పరిస్థితి నైనా ఎదుర్కొనేలా ప్రజలను సంసిద్ధులను చేయాలన్నారు.జిల్లా జాయింట్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మార్చాలి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక నాయకులు ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరావును, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డిని కలిసి గ్రంథాలయాల గురించి వినతి పత్రాలు సమర్పించారు.శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరే పక్కా భవనానికి మార్చి, నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. గ్రంథాలయాల్లో ఖాళీ గా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ దళిత, గిరిజన ఆవాసాల్లో ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులు గ్రంథాలయాలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఇరువురిని కోరారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యే దిశగా ప్రయత్నం చేస్తానని అన్నారు.శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తొలగించి, ఆధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మించడానికి, అన్ని రకాల సహకారం ఉంటుందని, తాత్కాలికంగా గ్రంథాలయాన్ని వేరేచోటకు మార్చడానికి భవన సమస్య ఉన్నదని, అనేక భవనాలను పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ సలహాదారులు ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ నాగాస్త్రి, జిల్లా కో కన్వీనర్ దేవర కొండ వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు ద్రోణాదుల శ్రీనివాస్, మేతర అజయబాబు, జె.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముని ఆశయాలకు తూట్లు





- మహిళా కళాశాల ఆస్తులను అమ్ముకుంటున్న యాజమాన్యం
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం డిమాండ్

**నరసాపురం,మేజర్‌న్యూస్ :**పేదలు, మహిళలు విద్యావంతులై సమాజాన్ని అభివృద్ధి చేయాలని విద్యాసంస్థలు నిర్మించిన పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. విద్యాసంస్థలను అభివృద్ధి చేసి, ఎంతోమందికి ఆదర్శంగా నిలవాల్సిన యాజమాన్యం ఆస్తులను అమ్మి అన్యా క్రాంతం చేస్తున్నారు. 1934లో మహిళా కళాశాల ఏర్పాటుచేసి ఎంతోమంది మహిళలకు విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని ఆయన కల్పించారు. బుధవారం బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాల సమీపంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పద్మశ్రీ అద్దేపల్లి సర్వేశెట్టి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అఖిలపక్ష నాయకులు కోట్ల రామ్ కుమార్, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, కావలి నాని, ముచ్చర్ల త్రిమూర్తులు, కొండవీటి త్రినాధ్, తదితర నాయకులు మాట్లాడుతూ పద్మశ్రీ అద్దేపల్లి సర్వేశెట్టి మహిళా అభ్యున్నతి కోసం హిందూ స్త్రీ పునర్వివాహ సంఘాన్ని స్థాపించారన్నారు. దీని ఆధ్వర్యంలో పాఠశాల, మహిళా కళాశాల, మ్యూ జిక్ కళాశాల, ఇంగ్లీషు మీడియం కాన్వెంట్‌ను ఏర్పాటు చేసి సమర్ధవంతంగా నడిపించారన్నారు. దాతల నుండి విరాళాలను సేకరించి మహిళా కళాశాలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. 14 సంవత్సరాల క్రితం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గా బాధ్యతలు చేపట్టిన నూలి శ్రీనివాస్ ఇతర పాలకవర్గం పైన పేర్కొన్న సంస్థలను ఒక్కొక్కటి నిర్వీర్యం చేస్తూ వచ్చారన్నారు. ఇటీవల కళాశాలకు చెందిన దాతలు ఇచ్చిన 350 గజాల స్థలాన్ని పాలక వర్గం అమ్ముకుందన్నారు. కళాశాల నిర్వహణ కోసమే ఆస్తులను అమ్ముతున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దాతలు ఇచ్చిన ఆస్తులను అమ్ముకునే హక్కు వీరికి ఎవరిచ్చారు అన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తులను అమ్మితే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రభుత్వ నిధులతో కళాశాలలో నిర్మించిన భవనాలను ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ కు, అద్దెకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా సంఘ పరిధిలోని పాఠశాల భవనాన్ని కూడా అద్దెకిచ్చారన్నారు. ఈ నిధులన్నీ దుర్వినియోగం అయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఇప్పటికే ఉమెన్స్ కళాశాల పాలకవర్గం అక్రమాలపై ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు. ఇటీవల ఒక అధికారి కళాశాల సెలవు రోజున విచారణ నిర్వహించడం దేనికి సంకేతం అన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని పాలకవర్గ అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిడి రాజు, మండా రాజా, సిహెచ్ సుబ్రహ్మణ్యం, సమయంతుల సర్వేశ్వర రావు, తెలనాకుల విజయకుమార్, నిప్పులేటి సత్యనారాయణ, కాకిలేటి మధు, దొంగ శ్రీరామచంద్రుడు, రావి వీరాస్వామి, కోట్ల రామకృష్ణ, సోమిశెట్టి ఆదినారాయణ, బిల్లు బ్రదర్స్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


# సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయాలి



**కైకలూరు,మేజర్ న్యూస్,** సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయుట, సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్,డిఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆదేశాలపై కైకలూరు టౌన్,రూరల్ మండలాలు కలిదిండి, మండపల్లి,ముదినేపల్లి పలు ప్రదేశాలలో అగ్ని పేలుడు, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఎక్సప్లోజిప్స్ అనుమానాస్పదమైన బ్యాగు ఉంచి ఆ ప్రదేశంలో దాన్ని గుర్తించి చేపట్టాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై పోలీసులు, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా పౌరులు బాధ్యతగా వ్యవహరించటం గురించి, పోలీసులు చేసే విధివిధానాలు గురించి క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్ధంగా ఎదుర్కొంటామని, ఏలూరు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు,ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వి రవికుమార్, టౌన్ ఎస్ఐ లు శ్రీనివాస్, వెంకట్ కుమార్, కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు,రూరల్ ఎస్ఐ రాంబాబు, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు ముదినేపల్లి ఎస్ఐ వీరభద్ర రావు,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## 55,983 మంది రైతులు నుండి 5.21 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు





- రూ.1,200 కోట్లకు రూ.1,130 కోట్లు రైతులు ఖాతాలో జమ

**భీమవరం,మేజర్ న్యూస్ :** జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ,గన్ని బ్యాగులు సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2024-25 సంవత్సరం రబి సాగుకు సంబంధించి జిల్లాలో 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 55,983 మంది రైతులు వద్ద నుండి 5.21 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యమును కొనుగోలు చేసి రూ.1,200 కోట్లకు గాను రూ.1,130 కోట్లు రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు రైతుల నుండి సేకరించిన ధాన్యమునకు సంబంధించి రూ.70 కోట్లు మాత్రమే రైతులు ఖాతాల్లో జమ చేయవలసి ఉన్నదని అన్నారు. ప్రస్తుతం రబి సాగులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణకు అనుగుణంగా మిల్లర్లకు కేటాయించిన రైతు సేవా కేంద్రాలకు గన్ని బ్యాగులు వేగవంతముగా సరఫరా చేయాలని సూచించారు.మిల్లర్స్ తీసుకున్న దాన్యము త్వరితగతిన మర పట్టించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికి కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని వారం రోజులో డెలివరీ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ డిస్టిక్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావుజిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామతం శ్రీరామరాజు,సెక్రటరీ కె.శ్రీనివాస్, తాలూకా అసోసియేషన్ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## డి డి ఆర్ సి సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ నాయకర్



**భీమవరం/నర్సాపురం, మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి కమిటీసమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రం భీమవరంలో ఈ సమావేశం జరిగింది. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తదితరులు పాల్గొన్న ఈ సమావేసంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పాల్గొని పలు సమస్యలపై మాట్లాడారు.

## శాఖ గ్రంథాలయంలో అల్లూరికి ఘన నివాళులు



**నరసాపురం, మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం నందు వేసవిజ్ఞాన తరగతులలో భాగంగా బుధవారం పిల్లల చేత వందేమాతరం పాడించి కథలు చెప్పి వారి చేత కథలు చెప్పించడం సూర్య అనే విద్యార్థి చేత గురు శిష్యులు కథ చెప్పించడం, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి జీవిత చరిత్ర గురించి వివరించారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రిసోర్స్ పర్సన్ గెల్లి శ్రీనివాస్ ఆరోగ్యం మంచి అలవాట్లు, ప్రతిరోజు ఉదయం నీరు తీసుకోవడం వలన శరీరంలోని బాధలు శుద్ధి అవుతాయి డాక్టర్ శ్రీనివాస్ హెచ్ ఆర్ డి డైరెక్టర్ పిల్లలకు చదవాలి చదవాలి చదవాలి పవర్ ఆఫ్ నాలెడ్జ్ కలిగి ఉండాలని, ఏకాగ్రత,పర్సనాలిటీ డెవలప్మెంట్ గురించి వివరించారు. అనంతరం శాస్త్రవేత్త సుబ్బారావు పిల్లలకు తల్లి దాస్యము నుంచి విముక్తి చేయడానికి సాహసం చేసిన" వైనతేయుని కథను"అందరికీ అర్థం అయ్యే రీతిలో ఆసక్తికరంగా వివరించారు. ఈ తరగతులలో సిహెచ్ శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ పద్యాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సూర్యం బాబు, చంద్రశేఖర్ జీవన్, నాగరాజు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## మాల దాసరి సంఘం అధ్యక్షుడు వరప్రసాద్‌కు ఎమ్మెల్యే 'చిర్రి' అభినందనలు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్** : జీలుగుమిల్లి గ్రామ మాల దాసరి సంక్షేమ సంఘానికి అధ్యక్ష కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాముల వరప్రసాద్, జెట్టి రామకృష్ణలను పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అభినందనలు తెలిపారు. బుధవారం మండలంలోని బర్రింకల పాడు క్యాంపు కార్యాలయంలో పాముల వర ప్రసాద్, జెట్టి రామకృష్ణ ఎమ్మెల్యే బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురిని అభినందిస్తూ సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి, కుటుంబ కష్టసుఖాలలో తోడుండాలని సూచించారు. అంతేకాకుండా దాసు సంక్షేమ సంఘానికి తామంతా అండగా ఉంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. తమకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే బాలరాజు, రవికుమార్‌లకు అధ్యక్ష కార్యదర్శుల వరప్రసాద్, రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ముహూర్తం ఎప్పుడో ?

– కళాశాల పునః ప్రారంభానికి వేళాయే కదా?

– 2014 నుండి సా....గుతున్న సమస్య !



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** మెట్టప్రాంతానికి ప్రధాన కూడలిగా, ఒకప్పటి పంచాయతీ సమితి కేంద్రంగా 26 పంచాయతీలకు ముఖ్య సమితి రాజధానిగా పేరుగాంచిన కొయ్యలగూడెంలో ఉన్నత విద్య, ఉన్నత వైద్య సదుపాయల పరంగా వెనుబడి ఉందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యమో,అధికారుల నిర్లిప్తత్తో,మరి ఏ ఇతర కారణాలో తెలియడంలేదని విమర్శలు వినవస్తున్నాయి. మండల కేంద్రం కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు ఏర్పాటుకు ప్రక్రియ ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కు అన్నట్లుగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2014లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 40 రోజులకు 2014 జూలై 17నఆయన కొయ్యలగూడెం మండలంలోని ఆరిపాటిదిబ్బల వద్ద ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల మహిళలో ముఖాముఖీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చారు. ఆ సమావేశానికి వెళ్లే ముందు చంద్రబాబు చెక్ పోస్టు కూడలిలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజలు,ఆ పార్టీ నాయకులు విన్నవించిన విన్నపాలు విని ఆయన స్పందించారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం, అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తున్నానని, త్వరలోనే ఏర్పాటు అవుతాయని ఆయన బహిరంగంగా ప్రకటించారు.

అయితే, 8 సం.రాలు పూర్తికావస్తున్నాఆ ప్రతిపాదనలు ఇంకా కాగితాలకే పరిమితమై అందని దాక్షగా ప్రజలను ఊరిస్తున్నాయి. 2015 జూన్ 20న రాష్ట్ర కాలేజ్ యేట్ ఎడ్యుకేషన్ కమిషనర్కార్యాలయంనుంచి రాజ మహేంద్ర వరంలోని ఆ శాఖ ఆర్.జె.డికి మోమో నెం.50/డిడిసి-సిఎస్/2015తో వచ్చిన ఒక లేఖ వచ్చింది. ఆ లేఖలో కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు గల పరిస్థితులను అంశాలను పరిశీలించి ఫీజు బులిటీ నివేదిక పంపాల్సిందిగా ఆర్.జె.డి.కి ఆదేశాలు వచ్చాయి. దానిపై ఆర్.జె.డి. బృందం అదే ఏడాది ఆగష్టు 5న కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వచ్చి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మళ్ళీ కదలిక వచ్చింది. పోలవరం ఎమ్మెల్యే బాలరాజు,ఎంపీ పుట్టా మహేష్ క్రియాశీలకంగా వ్యవహరించడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలలో కదలిక వచ్చింది. గత ఏడాది అక్టోబరులో విద్యాశాఖ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు కొయ్యలగూడెంలో స్థలాలను పరిశీలించారు. తరువాత గత నవంబరు 21న జంగారెడ్డిగూడెం ఆర్.డి.ఓ., జిల్లా రెవెన్యూ, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇక్కడకు వచ్చి స్థలాన్ని పరిశీలించి ఖరారు చేశారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచారు.తరువాత గత ఫిబ్రవరి 25న రాజమహేంద్రవరం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆర్.జె.డి. ప్రభుత్వానికి ఫీజుబులిటీ నివేదిక పంపారు. గత మార్చిలో జరిగిన కొయ్యలగూడెం మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తన ప్రసంగంలో డిగ్రీ కళాశాల మంజూరు అంశాన్ని ప్రస్తావించారు. త్వరలోనే కళాశాల మంజూరు అవుతుందని ఆయన సమావేశంలో చెప్పారు. ఈ నెల 5న పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం త్వరలోనే ఏర్పాటు అవుతాయని చెప్పారు. వచ్చే జూన్ నెలలో విద్యా సంవత్సరం ప్రారంభ అవుతుంది. కళాశాలలు తెరుచుకుంటాయి. డిగ్రీ తరగతుల్లో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతుంది.ఈ పరిస్థితుల్లో కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరయ్యే పరిస్థితిపై ప్రజలు, విద్యార్థుల్లో పలు సందేహాలు రేకెత్తుతున్నాయి.

# ఎక్సైజ్ లిక్కర్ గోడౌన్ ఆకస్మిక తనిఖీ చేసిన జేసి



భీమవరం,మేజర్న్యూస్ : ఉండి మండలం, మహాదేవపట్నంలో ఉన్న ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎక్సైజ్ లిక్కర్ గోడౌన్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం తనిఖీ చేసి గోడౌన్ లో ఉన్న స్టాక్, స్టాక్ మేనేజ్మెంట్ను పరిశీలించారు. లిక్కర్, బీరు డిమాండ్, సప్లై ఏ విధంగా ఉందని డిపో మేనేజర్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సి.సి కెమెరాలను పనిచేస్తున్నది, లేనిది, పరిశీలించి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. లిక్కర్, బీర్ల ఆన్లైన్ ఇండెంట్, ఆన్లైన్ డిస్పాచ్, ట్రాన్స్పోర్ట్ వివరాలు పరిశీంచారు. అక్కడ పని చేస్తున్న హమాలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని అప్రమత్తంగా ఉంటూసక్రమంగా విధులునిర్వహించాలని డిపో సిబ్బందికి సూచించారు. తనిఖీ సమయంలో డిపో మేనేజరు ఎల్.రంగారెడ్డి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రమేష్, స్టోర్ ఆఫీసర్ సి.సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# దేశంలో ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులలో ప్రజలను అప్రమత్తం చేయాలి





– మాక్ డ్రిల్ నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**ఏలూరు,మేజర్ న్యూస్ :** దేశంలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్తత పరిస్థితులలో జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం వివిధ శాఖల అధికారులతో మాక్ డ్రిల్ నిర్వహణ అంశంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పొరుగు రాష్ట్రంతో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఎటువంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా ప్రాణ రక్షణకు తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర విపత్తు నివారణ శాఖ,పోలీస్, తదితర శాఖల అధికారులకు ప్రజలకు అవగాహన కలిగించే జిల్లాలో ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించారని , మిగిలిన ప్రాంతాలలో కూడా సంబంధిత శాఖల అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. విపత్కర పరిస్థితి సంభవించినప్పుడు గ్రామ, పట్టణ ప్రాంతాలలో సైరన్ తో ప్రజలను అప్రమత్తం చేయాలనీ, ఆ సమయంలో పౌరులందరూ విద్యుత్ లైట్లు ఆపుచేసి, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునేలా ప్రజలు భయాందోళనలకు గురికాకుండా మాక్ డ్రిల్ లో అవగాహనా కలిగించాలన్నారు. విపత్తు సమయంలో సిద్ధం చేసిన కమ్యూనికేషన్ ప్లాన్ ను అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ విజయరాజు,డిపిఓ కె.అనురాధ, రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ షేక్ కరీం,నగరపాలక సంస్థ కమీషనర్ భాను ప్రతాప్,డిఎం హెచ్ ఓ డా.మాలిని, డిసిహెచ్ ఎస్ డా.పాల్ సతీష్, రాష్ట్ర విపత్తు నివారణ శాఖ,ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాట్కూర్ గొమ్ము గ్రామాన్ని 41.15లో కలపాలి : కలెక్టర్ కు వినతి



**వేలేరుపాడు,మేజర్న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు కాంటూరు లెవల్ 41.15లో కలపి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం తాట్కూర్ గొమ్ము కాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. గోదావరి వరదలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ గోడు విన్నవించారు.దీంతో కలెక్టర్ స్పందించి గ్రామసభలను సజావుగా జరిగేలా సహకరించాలని అందరికీ న్యాయం జర్నుతుందన్నారు.కలెక్టర్ కలసిన వారిలో అర్జా భిక్షం రావు,వలపర్ల చిట్టి బాబు,అనసూయ,విస్ఫు, జయమ్మ,కనక, సీత తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సముపార్జన యోధుడు అల్లూరి



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య సముపార్జనలో పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయులని ఎంపీడీవో వై రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో స్వాతంత్ర సమరయోధులు , మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన అల్లూరి నేటి యువతకు ఆదర్శమన్నారు. అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ఏపీఎంఓ కె శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం సుబ్బారావు , ఉపాధి హామీ , మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం

– సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం రూరల్ మండలం మిలటరీ మాధవరం గ్రామంలో జడ్.పి.హెచ్ స్కూల్ నందు సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు పెద్ద పీట వేస్తూ ప్రతి సంవత్సరం పిల్లలకు విద్యతో పాటు ఆట పాటలు అవసరం ఉందంటూ ఔట్ డోర్, ఇండోర్ స్పోర్ట్స్తో పాటు పెయింటింగ్ తదితర మనో వికాసాన్ని పెంచే ఫన్నీ గేమ్సలలో శిక్షణ తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెరుగుతుందని అన్నారు. ఈ మాధవరం గ్రామంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చేస్తాను. ఈ గ్రామంలో మిలటరీ వెళ్లడానికి యువత ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ఈ గ్రామాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి నిధులు సేకరించి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.ఈ నేపథ్యంలోనే పిల్లలకు సమ్మర్ హాలీడేస్ రావడం,ఆటల పట్ల ఆసక్తి కనబరిచే చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపులను సిద్ధం చేసి వారిలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలని అన్నారు.బాల బాలికలలో క్రీడా నైపుణ్యతను పెంపొందించి నిష్ణాతులైన క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఏడు వేసవి శిక్షణ తరగతలను నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి క్రీడాకారులను పరిచయం చేసుకుని,కాసేపు బ్యాటింగ్ చేసి నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో లక్కోకుల ప్రసాద్, కసే శ్రీనివాస్, అడ్డగర్ల ప్రసాద్, ఆకుల తాతారావు, కూటమి నాయకులు కార్యకర్తలు పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ నాయకులైనా ఔట్

**- శాసనసభ్యులు చిర్రి బాలరాజు హెచ్చరిక**
**- పోలవరం నియోజకవర్గ ప్రజల అభివృద్దే ధ్యేయం**
**- అక్రమాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 89789 89476కు చేయండి**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** శాసనసభ్యులు నా మనిషి ఏ పనైనా టక్కున చేసేస్తాం కానీ ఖర్చవుతుంది అంటూ కొంతమంది అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను మోసగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారి మాటలు నమ్మవద్దని,అటువంటి వ్యక్తులు సొంత పార్టీ నాయకులైనా బయటకు పంపుతాం అంటూ శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఘాటుగా హెచ్చరించారు. బుధవారం బర్రింకల పాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజుల నుండి తన పేరు చెప్పి కిందిస్థాయిలో కొంతమంది నాయకులు ఉద్యోగాలు ఇప్పిస్తామని, బదిలీలు చేయిస్తామని, ప్రమోషన్లు ఇప్పిస్తామంటూ,పలు కార్యాలయలలో అధికారుల చేత పనులు చేయిస్తామంటూ పైరవీలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చింది అన్నారు. అంతేకాకుండా పేకాట, కోడిపందాలు గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించి డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని అటువంటివారు సొంత పార్టీ నాయకులునైనా క్షమించేదిలేదన హెచ్చరించారు. గత కొన్ని రోజుల నుండి తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొంతమంది నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. అటువంటి అక్రమాలకు కొంతమంది అధికారులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. తన పేరు చెప్పి ఇలాంటి చర్యలకు పాల్పడితే అధికారులు సస్పెండ్‌కు గురవుతారని హెచ్చరించారు. తాను పోలవరం నియోజకవర్గ ప్రజల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నానని రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానానికి నియోజకవర్గాన్ని తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇటువంటి అక్రమార్కుల విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రజలకు టోల్ ఫ్రీ నెంబర్ 89789 89476 ను తెలియజేశామని వాట్సాప్ నెంబర్ కు ఇలాంటి అవినీతి అక్రమారులకు సంబంధించిన విషయాలను తెలియజేయాలని, ప్రజా సమస్యల గురించి సమాచారం అందించవచ్చని అన్నారు. అంతేకాకుండా మండల స్థాయిలో ఫిర్యాదుల బాక్స్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము,జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు కోలా మధు,కూరం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ల పంపిణీ,శిక్షణ పేరుతో దోపిడి

**- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వీరన్న**



**నరసాపురం,మేజర్‌న్యూస్:** కుట్టుమిషన్లు ట్రైనింగ్ ఇచ్చి మహిళలకు పెద్దపీట వేస్తామని చెబుతూ కూటమి ప్రభుత్వం అవినీతికిశ్రీకారం చుట్టిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న ఆరోపించారు. బుధవారం మండలంలోని సీతారాంపురంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.కూటమి ప్రభుత్వం ఇటీవల కుట్టు మిషన్లు ట్రైనింగ్ పేరుతో 167కోట్ల రూపాయలు స్కామ్ చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద వర్గాలకు ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు.

ఈ పథకం క్రింద ఒక్కొక్క లబ్ధిదారునికి ప్రభుత్వం కేటాయించిన మొత్తం 23వేల రూపాయలైతే, కుట్టు మిషన్ కొనుగోలు ఖర్చు 4300 రూపాయలు, అవుట్ సోర్స్ కాంట్రాక్టుఖర్చు 3వేల రూపాయలు మొత్తం 7300 రూపాయలు ఖర్చుపెట్టి 16700 రూపాయలు ను అవినీతి చేస్తున్నారన్నారు.ఒక లక్ష కుట్టు మిషన్ లకు గాను 73 కోట్ల రూపాయలు ను ఖర్చు పెట్టి167 కోట్ల రూపాయలును ఖర్చు చేసినట్లు చూపిస్తు న్నారు. అదేవిదంగా కమ్మ, ఆర్యా వైశ్య, క్షత్రియ, కాపు కార్పొరేషన్ క్రింద 115 కోట్ల రూపాయలును శాంక్షన్ కు సిద్ద చేసి 81.5 కోట్ల రూపాయలును దోచుకోవడానికి ప్రణాళికను సిద్ధం చేశారని, ఈ పథకం క్రింద మొత్తం 244.5 కోట్ల రూపాయలు అవినీతి చేస్తున్నారని అన్నారు. కనీసం కత్తెర, దారం తదితర వస్తువులను కిట్ల ద్వారా ఇవ్వవలసింది, కానీ బీసీ మహిళలే తీసుకొని పోవాలిసివస్తున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం అనేక సంక్షేమ పథకాలను డబల్ ధమాకా ఇస్తామని సూపర్ సిక్స్ పథకాలతోటి ప్రజలను మాయ మాటలు చెప్పి గద్దినెక్కిన తర్వాత మహిళలను అడ్డంపెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నా రని ఎంబీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న ఆరోపించారు.కూటమి ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

# డిఎస్సి అభ్యర్ధుల సమస్యలను పరిష్కరించాలి

**- నిరుద్యోగ భృతి ఇవ్వాలి - డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు శర్మ**




**పెనుగొండ,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ నెలకు మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి తక్షణమే విడుదల చేయాలని డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.ఎన్ శర్మ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ జయంతి సంధర్భంగా స్ధానిక కొత్తూరు సెంటర్ 1వ వార్డు ఉయ్యాలతాళ్ళ వద్ద బుధవారం డి.వై.ఎఫ్.ఐ,బాలల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభను నిర్వహించారు. తొలుతసీతారామరాజు చిత్రపటానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చుండూరి వెంకటసత్యన్నారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ 2024 మే లో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి మేనిఫెస్టోలో తొలి హామీగా రాష్ట్రంలో నిరుద్యోగులకు రూ.మూడు వేల రూపాయలు భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతికి సంబంధించిన హామీలపై నోరు మెదపలేదమని ఆవేదన వ్యక్తం చేసారు. నిరుద్యోగులు సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో అనేక సాంకేతిక సమస్యలతో అభ్యర్ధులు సతమతమవుతున్నారని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం డి.ఎస్.సి అభ్యర్ధుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో డి.వై.ఎఫ్ ఐ నాయకులు జి.మోహన్ కుమార్,అద్దంకి మణికిరణ్, బాలల సంఘం నాయకులు శ్రీపాద ప్రజ్వల,శ్రీపాద ప్రభవ, తమరాపు జితేంద్ర,తమరాపు మౌనిక,ఐద్వా నాయకురాలు యశోద సత్యవాణి, ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్రావు,తోటపల్లి సత్యన్నారాయణ,బండి రంగారావు,మేకా జోష్నిక,మేకా పునర్నవి,ఒబిలిశెట్టి బావేష్,ఎ. ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఓదూరి కుటుంబాన్ని ఓదార్చిన వై సి.పి నేత గోపీ



**యలమంచిలి, మజర్‌న్యూస్:** యలమంచిలి మండలం, దొడ్డిపట్ల గ్రామంలో ఓదూరి భాస్కర రావు,అబ్బిరాజుపాలెం గ్రామంలో వలవలవారి కుటుంబ సభ్యుల ను పాలకొల్లు వైస్సార్సీపీ ఇంచార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు బుధవారం పరామర్శించారు.మాజీ డీసీఎంస్ అధ్యక్షులు శ్రయడ్ల తాతాజీ,యలమంచిలి మండలం వైస్సార్సీపీ అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్ ,వినుకొండ రవికుమార్ ,యలమంచిలి మండలం వైస్సార్సీపీ నాయకులు, పాలకొల్లు నియోజకవర్గం నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం

**- ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండలకేంద్రమైన ఆగిరిపల్లి గ్రామంలో బుధవారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కులదేవతైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన సందర్భంగా ఆగిరిపల్లి పురవీధులను అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.ఈ సందర్భముగా కల్యాణ మండపంలో అమ్మవారికి కుంకుమ పూజ,లలితా సహస్రనామం పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధానకార్యదర్శి నాలాచిన్న సత్యంబాబు,కార్యదర్శి ఎం.శివరామ మూర్తి, కోశాధికారి ఎం సుధీర్,ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు చలవాది శైలజ,కార్యదర్శి మానేపల్లి సునీత, కోశాధికారి చలవాది మహాలక్ష్మి, వై ప్రణీత్, సాంబశివరావు, కెవేణు, వై చంద్రశేఖర రావు,తదితర ఆర్యవైశ్య ప్రముఖులు, సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## మీరా గ్రంథాలయంలో విప్లవీరుడు అల్లూరికి ఘన నివాళులు



**నరసాపురం,మేజర్ న్యూస్ :** మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి కార్యక్రమాన్ని భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం, మీరాస్మారక గ్రంథాలయంల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం గ్రంథాలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం రవి అస్తమించన బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తి దేశ ప్రజలకు మార్గదర్శమని అన్నారు.అల్లూరి స్ఫూర్తితో దేశభక్తి భావాలను నేటి యువత పునికిపుచ్చుకోవాలన్నారు. భారతదేశ ప్రజలు బ్రిటిష్ పరాయిపాలన నుండి విముక్తి చేసి, దేశ ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రంతో జీవించాలని, బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా మన్య ప్రాంతంలో ఉన్న గిరిజన ప్రజలతో గెరిల్లా పోరాటాన్ని నిర్వహించారన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో దేశంలో ప్రజానికం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాటంలోకి మరింత ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ కమిటీ సభ్యులు పొగాకునారాయణరావు,బుడి జోగేశ్వరరావు, నోములకొండ, పున్నని అప్పల నాయుడు,యూవీఎస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# తొలకరి నాటికి మరమ్మతులు పూర్తి చేయండి





**– అధికారులకు ఎంపీ పుట్టా మహేష్,ఎమ్మెల్యే చింతమనేని ఆదేశం**

**దెందులూరు,మేజర్ న్యూస్:** కాలువల మరమ్మతుల పనులు తొలకరి నాటికి పూర్తి చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. దెందులూరులో రూ.77.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీతంపేట కాలువ సైఫన్ మరమ్మతు పనులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి బుధవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. కాలువ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ సీతంపేట కాలువపై సైఫన్ మరమ్మతులతో ఈ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దెందులూరు నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎనలేని కృషి చేస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వాన్ని, కొందరు కావాలనే సామాజిక మాధ్యమాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు దెందులూరు సమీపంలో నిరుపయోగంగా ఉన్న రైల్వే లోలెవెల్ బ్రిడ్జిని ఎంపీ,ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాకాలంలో వరద నీరు పోటెత్తి సందర్భాల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు



**యలమంచిలి,మేజర్న్యూస్:** మండలంలోని చించినాడ, కలగంపూడి గ్రామాలలో డివైఎఫ్ఐ, కెవిపిఎస్, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు చించినాడ గ్రామంలోని ఉయ్యాల స్తంభాల సెంటర్ నందు ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రముఖ అభ్యుదయ వాది రైతు సంఘం నాయకులు రుద్రరాజు చిన్న వర్మ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తెన్నేటి స్థాలిన్, డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సీఐటీయూ మండల కార్యదర్శి దేవ సుధాకర్ కెవిపిఎస్ జిల్లా నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు కానేటి బాలరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అడవి బిడ్డల హక్కుల కోసం ఆనాటి బ్రిటీష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు వీరమరణం పొంది వంద సంవత్సరాలు గడిచినా ఆయన ఇంకా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అటువంటి నాయకుడిని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పటి తరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెన్నేటి శివాజీ, నేలపాటి లూధర్ బాబు,శెట్టి మి నరసింహ రావు,భా రతల పద్మరాజు,పల్లేరు యోహాను తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్యకు నివాళులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్వర్గీయ దామోదరం సంజీవయ్య 53 వర్ధంతి సందర్భంగా ఏలూరు కొత్త రోడ్ల గల నవ సమాజ సొసైటీ కార్యాలయంలో సంజీవయ్య 53వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతదేశం లోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేయటం యావత్ దళిత జాతికి గర్వకారణం అని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ కర్రే అంబేద్కర్ పోలిమెట్ల దేవకాంతరావు కాపుదాసి రవికుమార్ ఎరికిపాటి విజయ్ బుస్సా తిరుమల రావు మాముడూరి మహంకాళి సొంగ మధు పోలిమెట్ల మోజెస్ దాసి వెంకటేశ్వర్లు కండవల్లి స్వామి దాసు కంచర్ల విజయ శేఖర్ బయ్యారపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మోడీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానం






**– భారత సైన్యానికి మద్దతు**

**: జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ**

**ఏలూరు,మేజర్ న్యూస్:** దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న ఉగ్రవాదం,మతోన్మాదంపై పోరాటం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు,పార్టీ జిల్లా ఇన్చార్జ్ అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన పహల్గాం దాడి ఘటనలో పర్యాటకులు చనిపోవడం దురదృష్టకరం అన్నారు. పహల్గాం దాడి ఘటన భద్రత వైఫల్యమే అని విమర్శించారు. 370వ అధికరణం రద్దు చేసిన తర్వాత కాశ్మీర్లో తీవ్రవాదం సమస్య పోయిందని ఆర్బాటకు ప్రకటనలు చేశారని,పహల్గాం దాడి ఘటనతో తీవ్రవాదం అంతం కాలేదని రుజువైందన్నారు. మోడీ అనుసరించిన రాజకీయాల దుష్పరిణామాలు ఎలా ఉంటాయో పహల్గాం ఘటన తరువాత వివిధ రాష్ట్రాలలో ఉన్న కాశ్మీరులపై దాడులు నిరూపిస్తున్నాయని తెలిపారు. దేశంలో ప్రజల మన ప్రాణాల కన్నా ప్రధాని మోడీకి బీహార్ ఎన్నికలు ముఖ్యం అయ్యాయని విమర్శించారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన సిపిఐ సీనియర్ నాయకులు మారిన వెంకటరావుకు, పహల్గాం దాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్,ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్,ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్,ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా,మై సాక్షి వెంకటాచారి, పుప్పాల కన్నబాబు,బాడిస రాము,జేవి రమణ రాజు, కొండేటి బేబి,జిల్లా కౌన్సిల్ సభ్యులు, పాల్గొన్నారు.

## చింతలపూడిలో పోలీసుల మాక్ డ్రిల్ ప్రజల భద్రత పై అవగాహన



**చింతలపూడి,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, జంగారెడ్డి గూడెం డిఎస్పి యు.రవిచంద్ర ఆదేశాల మేరకు,ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజశేఖర్, ఎస్ఐ కుటుంబ రావు,సిబ్బంది చింతలపూడిలో భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించారు. సంఘ విద్రోహ చర్యలను అడ్డుకోవడం, శాంతిభద్రతలు కాపాడటం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం ఈ డ్రిల్ ప్రధాన లక్ష్యం అని వివరించారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్ళు, అనుమానాస్పద వస్తువులు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, ఇతర శాఖల సమన్వయంతో చేపట్టే చర్యలను వివరించారు. ప్రజలు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ఈ డ్రిల్లో చింతలపూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీగా పనిచేయాలి

**– ప్రజా దర్బార్లో అర్జీలు స్వీకరించిన ఎంపీ పుట్టా మహేష్**





**ఏలూరు, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. స్థానిక శాంతినగర్ లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎంపీ అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ భరోసా కల్పించారు. తక్షణమే స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ అప్పటికప్పుడు అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వారికి వివరించి, పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను తమ సిబ్బంది ఆన్లైన్ చేస్తారని ఎంపీ తెలిపారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి సంబంధించిన పురోగతిని అర్జీదారులకు ఫోన్ చేసి సమాచారం అందిస్తారని ఎంపీ పేర్కొన్నారు. తాను లేని సమయంలో కూడా కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగం ద్వారా అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఎప్పుడైనా తన క్యాంపు కార్యాలయానికి వచ్చి సేవలు వినియోగించుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ సూచించారు.

## యుద్ధంపై అవగాహన కల్పించిన ఎస్ఐ





**ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్ :** భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెల కొన్న నేపధ్యంలో పాకిస్తాన్ దాడి చేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ద్వారకా తిరుమల వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం (మాక్ డ్రిల్ ) నిర్వహించారు. సురక్షిత ప్రదేశాలకు ఎలా వెళ్లాలి, అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గాయపడిన వ్యక్తులను ఏ విధంగా రక్షించాలి అనే అనేక సంఘటనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

**– ఇప్పటివరకు 501 కోట్ల విలువైన 2.17 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ**
**– రూ.390 కోట్లు రైతుల ఖాతాలో జమ**
**– 55 లక్షల గోనెసంచుల,1920 వాహనాలు**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రస్తుత రబీలో రైతుల నుండి ఇప్పటివరకు 501 కోట్ల రూపాయల విలువచేసే 2. 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. జిల్లాలో ధాన్యం సేకరణపై జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను బుధవారం తన ఛాంబర్లో పాత్రికేయుల సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్లో తగినంత సాగునీరు అందుబాటులో ఉండడం, వాతావరణం అనుకూలించడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చిందన్నారు. గత 10 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ప్రస్తుత రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించామన్నారు. ప్రస్తుత రబీలో ఇంతవరకు 501 కోట్ల రూపాయల విలువైన 2. 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి, 390 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, ధాన్యం సేకరణ చేసిన 48 గంటలలోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేశామని,అధిక శాతం మంది రైతులకు 24 గంటలలోగా సొమ్మును జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 180 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణలో ప్రధానమైన గోనెసంచుల, హమాలీలు, రవాణా సమస్యలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామన్నారు.అదేవిధంగా జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా 1920 వాహనాలను ధాన్యం రవాణాకు సిద్ధం చేశామన్నారు. ధాన్యం అమ్మకంలో రైతుల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్‌కు వచ్చే సమస్యలను పౌర సరఫరాలు రెవిన్యూ, వ్యవసాయం, సహకార శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరిస్తున్నారని జేసీ ధాత్రిరెడ్డి తెలియజేసారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శివ రామ్మూర్తి, డీఎస్ఓ ప్రతాపరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీ, ప్రభృతులు పాల్గొన్నారు.

# అల్లూరి స్ఫూర్తితో ఉగ్రవాదం,మతోన్మాదంపై పోరాడాలి

**– సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు**




**ఏలూరు,మేజర్ న్యూస్:** స్వాతంత్ర సమరయోధుడు, మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామ రాజు 101 వ వర్ధంతి సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏలూరు ఆర్ఆర్ పేట అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద గల సీతారామరాజు విగ్రహానికి అక్కినేని వనజ, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా సమితి ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తదితర నేతలతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో దేశంలో ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాడాలని పిలుపు ఇచ్చారు.ఆనాడు అల్లూరి సీతారామ రాజు తనకోసం అమాయక గిరిజనులు చిత్రహింసలకి గురికావడం భరించలేక, తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ధీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆనాడు దేశ స్వాతంత్ర పోరాటంలో గిరిజనులను చైతన్యం చేసి గెరిల్లా సాయుధ పోరాటం నడిపినటువంటి సీతారామరాజు నేటి యువతరానికి స్ఫూర్తి అని అన్నారు. ఏఐటియుసి జిల్లా సమితి ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా సమితి అధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి కిషోర్ లు మాట్లాడుతూ భారత పుణ్య భూమిని ఆక్రమించుకున్న బ్రిటీష్ వలసవాదులకు దోపిడి పీడనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు పోరాడారని గుర్తు చేశారు. బ్రిటిష్ వాడి వెన్నులో వనుకు పుట్టించడమే కాకుండా, తుపాకీ గుండ్లకు, తన గుండెని ఎదుఠెడ్డి పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సమితి కార్యదర్శి ఏ.అప్పలరాజు ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిభజంత్రి శ్రీనివాస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఏఐటీయూసీ నాయకులు బుగత జగన్నాధం, బళ్ళ కనక దుర్గారావు, బట్టా మాణిక్యాలరావు సిపిఐ నాయకులు కె.గురవయ్య ,యర్రా వెంకటేశ్వర్లు,కనకం జగన్మోహన్రావు,%ూఅంట% జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్‌లి తది తరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి మాత జన్మదిన వేడుకలు






**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** వాసవి మాత జన్మ దినోత్సవం పురస్కరించుకొని తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారికి చక్క వెంకట రామ రమణమూర్తి, రాధా దంపతులచే ముందుగా విఘ్నేశ్వరపూజ,108 వెండి కలశములతో కలశ పూజ,108 సువాసినిలతో వెండి కలశములతో ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి తదనంతరం అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో పసుపు కుంకుమలతో విశేష అభిషేకములు జరిగినవి. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళాలచే కుంకుమ పూజలు,లలిత సహస్ర పారాయణం, అమ్మవారికి చేయడం జరిగింది. అనంతరం భక్తుల సహకారంతో అమ్మవారికి సుమారు 10 కేజీలు వెండితో చేయించిన వెండి కమలం పీఠం, వివిధ రకాలైన పుష్పములతో అమ్మవారిని విశేషంగా అలంకరించి అనంతరం నీరాజన మంత్రపుష్పము తీర్థ ప్రసాదములు ఇవ్వడం జరిగింది.ముందుగా వాసవి క్లబ్ వారిచే ఉదయం బైక్ ర్యాలీ మధ్యాహ్నం సుమారు 1000 మందికి అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం గౌరవఅధ్యక్షులు మారం వెంకటే శ్వరరావు, అధ్యక్షులు కొర్లపర శ్రీరామచంద్రమూర్తి, సెక్రటరీ నున్న బాలా త్రిపురసుందరరావు, ట్రెజరర్ భోగవల్లి రమేష్ ఆలయ కార్యదర్శులు ఆలపాటి సత్యనారాయణ ఆర్య వైశ్య సంఘము పూర్వాధ్యక్షులు పేరూరు కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, వభిలిశెట్టి నటరాజ్, ఆర్యవైశ్య సంఘం డైరెక్టర్లు పి వెంకట్రామయ్య, కే సూరిబాబు, కె ఆంజనేయులు జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం సెక్రటరీ పొన్నగంటి స్వర్ణకాంతి, ట్రెజరర్ వాసవి వనిత క్లబ్ సెక్రటరీ కారుమూరీ సునీత, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి అనిల్ , సెక్రటరీ మండ పవన్ ,ట్రెజరర్ ముత్త శ్రీధర్ వాసవి క్లబ్ పూర్వాధ్యక్షులు పవన్, సమయ మంతుల వైకుంఠం, మానేపల్లి సుబ్రమణ్యం, చీమకుర్తి రాజా, వాసవి క్లబ్ డైరెక్టర్స్ కే సత్యం, గ్రంధి వీర్రాజు, ముత్తానాగేశ్వరరావు, మల్లికార్జున రావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రెసిడెంట్ శారదారాణి, ఆర్యవైశ్య సంఘం డైరెక్టరర్స్, వాసవి క్లబ్ డైరెక్టర్ సభ్యులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## సమర యోధుడు అల్లూరి స్ఫూర్తి ఎంతో గొప్పది : జిల్లా ఎస్‌పి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101 సంవత్సరాలు వర్ధంతిని పురస్కరించుకొని ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనముగా శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంబంధం లేనటువంటి ప్రాంతాలలో నివసిస్తు న్నటువంటి మనుషుల శ్రేయస్సు కొరకు స్వాతంత్రం కొరకు ఏ సంబంధం లేనటువంటి అల్లూరి సీతారామరాజు మారుమూల ప్రాంతాలలో ఉన్న ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని ముఖ్య సంకల్పంతో ఎటువంటి ఆయుధాలు లేకుండా బ్రిటిష్ సామ్రాజ్యానికి వణికిచారని,స్వాతంత్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ఎంతో గొప్పది అని అన్నారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి ఆదర్శప్రాయమని మనము ఉద్యోగ నిర్వహణలో ఆయన ఆదర్శం ను స్ఫూర్తిని ప్రతి ఒక్క సిబ్బంది స్ఫూర్తిదాయకంగా ఉద్యోగ నిర్వహణ చేయాలని సిబ్బందికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చందర్రావు, ఏ.ఆర్ డిఎస్పీ చంద్ర శేఖర్ ,ఆర్. ఐ పవన్ కుమార్, డి సి ఆర్ బి ఎస్ఐ రాజా రెడ్డి హెూమ్ గార్డ్ ఆర్.ఎస్. ఐ భాస్కర్ ఆర్. ఎస్ ఐలు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ప.గో.జిల్లా కలెక్టర్‌కు రెండు రాష్ట్ర స్థాయి రెడ్ క్రాస్ అవార్డులు

**– 8న రావాలని విజయవాడ రాజ్ భవన్ నుండి ఆహ్వానం**



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులు చదలవాడ నాగరాణి అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 2023–24,2024–25 సంవత్సరాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ రెడ్ క్రాస్ అవార్డులతో సత్కరించడానికి ఎంపిక చేయడం జరిగింది.దీనిని పురస్కరించుకొని మే 8వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ రాజ్ భవన్‌లో నిర్వహించే ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ నుండి అవార్డును అందుకోవాలని కోరుతూ రాజ్ భవన్ నుండి ఆహ్వానాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందుకోవడం జరిగింది.జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయిలో రెండు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డులను పొందడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

## రెడ్ క్రాస్ సంస్థ ద్వారా మెరుగైన సేవలు అందించాలి

**– సేవలు, సభ్యత్వాలు విస్తరించాలి : జిల్లా కలెక్టర్**



**ఏలూరు,మేజర్ న్యూస్:** రెడ్ క్రాస్ సేవలను ఇంకా విస్తరింపచేసి రెడ్ క్రాస్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రెడ్ క్రాస్ నూతన కార్యవర్గానికి సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ నూతన చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్, నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ మరియు ఏలూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

రాబోయే రోజుల్లో జిల్లాలోని రెడ్ క్రాస్ సంస్థను బలోపేతం చేసేలా, రెడ్ క్రాస్ సభ్యత్వాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి వంటి విషయాలను నూతన కమిటీ సభ్యులతో కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ శాఖ ముందుండేలా నూతన కమిటీ పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, మేతర అజయ్ బాబు, ఎంవివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.250 కోట్లతో 220 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్





– విద్యుత్ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ

పాలకొల్లు,మేజర్ న్యూస్ : పాలకొల్లు నియోజకవర్గంలో విద్యుత్తు కష్టాలు, బాధలు శాశ్వతంగా తీరేలా రూ.250 కోట్లతో 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను మంజూరు చేస్తానని, త్వరలోనే దీని నిర్మాణ పనులు మొదలవుతాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. మంత్రి రామానాయుడు పాలకొల్లు నియోజకవర్గానికి 220 కే.వి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరగా ఆయన పై విధంగా స్పందించారు. పాలకొల్లు రూరల్ నాగరాజు పేటలో రూ.2.83 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రులు రవికుమార్, రామానాయుడు, కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తదితరులు కలిసి ప్రారంభించారు. అంతకుముందు పాలకొల్లు పట్టణ 26 వార్డు బెజవాడ కోడు పై 42.23 లక్షలతో వంతెనకు, కొంతేరు గ్రామంలో ఆవ మీడియం డ్రైన్ పై రూమ్ 31 లక్షలతో గ్రావెల్ రహదారి, మరో 29 లక్షలతో గ్రావెల్ రహదారి, 31 లక్షలతో డ్రైన్ త్రవ్వకం పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. నాగరాజు పేట వద్ద జరిగిన బహిరంగ సభలో రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చంద్రబాబు వారం వారం సమీక్షలు జరుగుతూ తగిన ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ రైతులతోపాటు ఆక్వా రంగానికి ఇస్తున్నామని చెప్పారు. మంత్రి రామానాయుడు గురించి మాట్లాడుతూ ఇటువంటి ఎమ్మెల్యే ఉండడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టం అన్నారు. గత జగన్ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను పట్టించుకోలేదని, ముఖ్యంగా మా ప్రాంతంలో గల నాగార్జున సాగర్ పై ఆధారపడిన కాలవలకు రూపాయి ఖర్చు పెట్టడం గాని, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు విరిగిన పట్టించుకోవడం గానీ జరగలేదన్నారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమానికి కేంద్రం అండగా నిలుస్తుంది అన్నారు. పాలకొల్లు నియోజకవర్గం అభివృద్ధికి నా వంతు కృషి ఉంటుందన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు వినియోగం పెరిగేలా ఐదు విద్యుత్ సబ్ స్టేషన్‌లు ప్రారంభించడం జరిగిందన్నారు. 133 కెవి విద్యుత్ సబ్స్టేషన్ మంజూరైనా గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఒక్క అడుగు ముందుకు పడలేదు అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు,ఆర్డీవో దాసిరాజు, విద్యుత్ శాఖ ఎస్.ఈ ఏ రఘునాధ బాబు, టెక్నికల్ ఈఈ ఝాన్సీ, ఈఈబీ రఘు, ఏడీఈ రామకృష్ణ, తాసిల్దార్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పార్థసారథి, పలువురు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి రూ.50 లక్షలు

– ప్రకటించిన ఎంపీ ఎంపీ పుట్టా మహేష్



**ఏలూరు, మేజర్ న్యూస్ :** ఏలూరు కొత్త బస్టాండ్ సెంటర్ సమీపంలో శిధిలావస్థకు చేరిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పరిశీలించారు. పాఠకులు, ప్రజల విజ్ఞప్తి మేరకు ఎంపీ,మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో గ్రంథాలయం అభివృద్ధి కి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రకటించారు. నూతన భవనం నిర్మించే వరకు ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేపట్టే అంశం పరిశీలించాలని అధికారులకు ఎంపీ సూచించారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఎంపీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన





**– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అధ్యక్షతన ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామం నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవ సందర్భంగా 1.5.25 నుండి 7.5.1025 వరకు నిర్వహించిన వారోత్సవాల భాగముగా చివరి రోజున బుధవారం మాదేపల్లి గ్రామం నందు అసంఘటిత కార్మికులకు చట్టాల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వారోత్సవాలు భాగంగా నిర్వహించిన విజ్ఞాన సదస్సులలో అత్యధికంగా మహిళా శ్రామికులు పాల్గొన్నారు, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శ్రమజీవులై కుటుంబ ఆర్థిక స్వావలంబన కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఇది హర్షించదగ్గ విషయం, మహిళలకు పని చేసే చోటే గాని మరి ఏ ఇతర సందర్భంలో గానీ మహిళలు అభద్రతా భావానికి లోనైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని, తక్షణ సహాయాన్ని అందించడానికి కృషి చేస్తామని సూచించారు. బాల్యవివాహాలు నిర్వహించటం వల్ల బాలికల ఆరోగ్యము నశిస్తుందని, శారీరక ఎదుగుదల లేకుండా వివాహం చేయటం వల్ల ముందు ముందు అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతాయి కావున బాలికలకు వివాహ వయసు వచ్చిన తర్వాత మాత్రమే వివాహాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి,న్యాయవాదిపి.రత్నరాజు, ఎం.ఎన్.ఆర్.ఇ. జి.ఎస్., ఏ.పీ.డి విక్టర్,ఎంపీడీవో శ్రీలత గ్రామ కార్యదర్శి వై.సుమలత గ్రామ సర్పంచ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు సమరయోధుడు అల్లూరి



**ఇరగవరం మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి పరిషత్ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించరన్నారు. అటువంటి మహా విరుణ్ణి స్మరణకి తెచ్చుకోవడం దైవ చింతనంవంటిదన్నారు అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీ.డి.పి.నాయకులు వేంద్ర నాగ రాజేశ్వరావు, కరెం బాబురావు,ఇ. ఓ. ఆర్. డి నర్సింహామూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తరచూ గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలి

– రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ 'గోనుగుంట్ల'






**ఏలూరు, మేజర్‌న్యూస్.** ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 9వరోజు సంధర్బంగా బుధవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు జిల్లా కేంద్ర గ్రంథాలయంనకు మొదటి సారిగా సందర్శించడం జరిగింది. ముందుగా ఉమ్మడి ప.గో.జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్.శేఖర్ బాబు పరిషత్ చైర్మన్‌ని ఘనంగా స్వాగతించారు. చైర్మన్ గ్రంథాలయఅన్నీ విభాగాలను సందర్శించి చదవురుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 'సమ్మర్‌క్యాంప్'నందు పాల్గొని శిక్షణ తరగతులలో పాల్గొంటున్న చిన్నారులను,రిసోర్స్ పర్సన్లను అభినందించారు. విధ్యార్థులను తరచూ గ్రంథాలయమునకు రావడం అలవాటు చేసుకోవాలని మంచి విద్యాబుద్ధులు నెర్చుకోవాలని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలనికోరారు.విద్యార్థులతో కథలు, కథనాలు, నృత్యాలు,డ్రాయింగ్, గణితం, జనరల్ నాలెడ్జ్,క్విజ్,శిక్షణ ఎలా శిక్షణ పొందుతున్నారు. చిన్నారులు ఈవేసవి శిక్షణ తరగతులుకు మీతోటి స్నేహితులకు, మీకు తెలిసినవారికి కూడా భాగస్వాములు చేయాలిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సనులు డి.శ్రీవల్లి,వై.ఫణికాంత్, పి.శంకర్,కే.తరుణ్, విజయ్ కుమార్ మీడియా ప్రతీనిధులు, గ్రంథాలయసంఘం పునర్వికాస జిల్లా కన్వీనర్,సంఘసంస్కర్తలు,డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు,అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్,ఎమ్ డి.అస్లాంపాషా,బివిఎస్.లక్ష్మి,విద్యార్థులు,తధితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతకు చలి వేంద్రాలు ఉపయోగం

## : తాసిల్దార్ సత్యనారాయణ




**నరసాపురం,మేజర్ న్యూస్:** స్థానిక చినమామిడిపల్లి జవదాలపేట జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ సోడ దాసి ఆర్థర్ బెన్ని,శాంతమ్మ ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చలి వేంద్ర ము ను ఏర్పాటు చేశారు. బుధవారం తహసీల్దార్ ఐ వి వి సత్య నారాయణ ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నదని చలివేంద్రాలు ప్రయాణికులకు ఎంతో ఊరటనిస్తాయన్నారు. ఈ చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను తాసిల్దార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి సర్పంచ్ ఈ ద సురేష్ బాబు,సరిపల్లి సెక్రటరీ సోడ దాసి మోహన్ రావు ,జై భీమ్ ఫౌండేషన్ చైర్మన్ సోడ దాసి శ్రీధర్, ట్రస్ట్ సభ్యులు వర్ధనపు యేసు రత్నం ,పిల్లి ప్రదీప్,నల్లి రాజేష్, సాక రాజు,మేడపాటి శరత్, కొంగా ఆల్లెక్స్,బో డు పల్లి సత్య నారాయణ,సోడ దాసి రత్నరాజు,పిట్టా రాంబాబు, పిట్టా రాజబాబు,బుడి తి కాసు, నెల రవి కుమార్,వి సురేష్,పిట్టా డేవిడ్ సన్,కందిక ట్ల అబ్రహాము తదితరులు పాల్గొనగా మొదటిరోజు మజ్జిగ ను ప్రజలకు అందించారు.